

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 103 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 14, మార్చి 2026 | పేజీలు 9 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన శివన్న !

**స్వతంత్ర అభ్యర్థిని గెలిపించి వార్డుకు మేలు చేశారు**
**వైస్ చైర్మన్ సునాయాసంగా కైవసం చేసుకోగలిగారు**
**పార్టీలకు అతీతంగా వార్డు అభివృద్ధి చెందాలి**



వర్ధన్నపేట మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్ముడు షిబా రాణి రాజేందర్ గెలుపు కోసం శివన్న చేసిన త్యాగం,కష్టం నా నిబద్ధతను గుర్తు పెట్టుకొని, నేను ఇంటికి వచ్చిన వెంటనే ఆయన స్వయంగా మా ఇంటికి విచ్చేసి నా ఆశీర్వాదాలు తీసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆ సందర్భంలో మన మధ్య సుదీర్ఘంగా ఆత్మీయంగా అనేక విషయాలు మాట్లాడుకోవడం జరిగింది.
మొట్టమొదటిసారిగా మా ఇంటికి విచ్చేసిన సందర్భంగా, డాక్టర్ బరిగెల శివ జై భీమ్ టీవీ చైర్మన్ ఆయనకు చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పరస్పర గౌరవం, విశ్వాసం, స్నేహబంధం మరింత బలపడింది. సమాజం కోసం, న్యాయం కోసం కలిసి ముందుకు సాగాలని, పరస్పర సహకారంతో ప్రజలకు సేవ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించుకున్నాం.
నాయకత్వం అంటే పదవి కాదు - ప్రజల కోసం త్యాగం చేయాలనే సంకల్పం. అదే మన ప్రయాణానికి బలం.స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన బలంతో దక్కిన వైస్ చైర్మన్ పదవి పేదలకు సహాయార్థంగా నిలువాలని మనస్ఫూర్తిగా అభినందించారు.

- వర్ధన్నపేట జై భీమ్ న్యూస్:-

## గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత

**సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు: పొన్నం ప్రభాకర్**

ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే పూర్తి బాధ్యతని, అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. - హైదరాబాద్, జై భీమ్ న్యూస్



8

## ఇంటర్ విద్యార్థి ఘాతుకం..

ముగ్గురు బాలికలపై అత్యాచారం,
వీడియోలతో బ్లాక్‌మెయిల్
ప్రేమ పేరుతో వంచించి, అసభ్య వీడియోలతో డబ్బులు వసూలు
బాధితురాలికి అబార్షన్ చేయించిన వైనం
నిందితుడు జువైనల్ హోంకు, సహకరించిన ఇద్దరు డాక్టర్లు, నర్సు అరెస్ట్
కొల్లాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రి స్కానింగ్ సెంటర్ సీజ్



2

## ప్రయాణికులపై ఫ్యూయల్ ఛార్జ్ భారం.. ఇండిగో నిర్ణయం

8

## వాహన రిజిస్ట్రేషన్‌లో కొత్త రూల్.. ఇక అంతా ఆన్‌లైనే!

వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇకపై పూర్తి ఆన్‌లైన్
డీలర్లు వసూలు చేసే అదనపు ఛార్జీలకు అడ్డుకట్ట
ఆర్‌టీఏ కార్యాలయాలకు వెళ్లకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి
నేటి నుంచే పత్రాల డిజిటల్ అప్‌లోడ్ విధానం అమలు



2



## కేయూలో విద్యా సమస్యలపై విద్యార్థులు, కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ అధ్యాపకుల ఆవేదన

ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తాం - తీన్మార్ మల్లన్న

7

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ఇంటర్ విద్యార్థి ఘాతుకం..

**ముగ్గురు బాలికలపై అత్యాచారం, వీడియోలతో బ్లాక్‌మెయిల్**
**ప్రేమ పేరుతో వంచించి, అసభ్య వీడియోలతో డబ్బులు వసూలు**
**బాధితురాలికి అబార్షన్ చేయించిన వైనం**
**నిందితుడు జువైనల్ హోంకు, సహకరించిన ఇద్దరు డాక్టర్లు, నర్సు అరెస్ట్**
**కొల్లాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రి స్కానింగ్ సెంటర్ సీజ్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

చదువుకోవాల్సిన వయసులో ఓ ఇంటర్ విద్యార్థి కామాంధుడిగా మారి ముగ్గురు బాలికల జీవితాలను ఛిన్నాభిన్నం చేశాడు. ప్రేమ పేరుతో వారిని లోబర్చుకుని, అత్యాచారానికి పాల్పడటమే కాకుండా ఆ దృశ్యాలను వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేశాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వెలుగుచూసిన ఈ దారుణ ఘటన తీవ్ర కలకలం సృష్టిస్తోంది. కొల్లాపూర్ మండలానికి చెందిన ఓ విద్యార్థి నాగర్‌కర్నూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. తనతో పాటు చదివే పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్, వనపర్తి ప్రాంతాలకు చెందిన ముగ్గురు బాలికలను ప్రేమ పేరుతో వంచించాడు. వారిపై అత్యాచారానికి పాల్పడి, ఆ దృశ్యాలను తన ఫోన్‌లో చిత్రీకరించాడు. అనంతరం ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని, వారి తల్లిదండ్రులకు పంపిస్తానని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. నిందితుడి వేధింపులు భరించలేకపోయిన బాధితురాళ్లలో ఒకరు ధైర్యం చేసి విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో వారు సదరు విద్యార్థిని పట్టుకుని దేహశుద్ధి చేసి, అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికరమైన నిజాలు బయటపడ్డాయి. బాధితుల్లో ఒక బాలిక గర్భం దాల్చగా, కొల్లాపూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి అబార్షన్ చేయించినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన పోలీసులు, నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేసినందుకు సదరు ప్రైవేట్ ఆసుపత్రిలోని స్కానింగ్ సెంటర్‌ను బుధవారం సీజ్ చేశారు. గురువారం ఇద్దరు డాక్టర్లు, ఒక నర్సును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. ప్రధాన నిందితుడైన విద్యార్థిని జువైనల్ హోంకు తరలించారు.

## ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ శుభాకాంక్షలు



హైదరాబాద్ / జై భీమ్ న్యూస్ :

తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరవుతున్న అన్ని విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షల పట్ల ఎలాంటి భయం లేదా ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాలకు కనీసం 40 నిమిషాల ముందుగానే చేరుకోవడం ద్వారా ఎలాంటి తొందరపాటు లేకుండా పరీక్షకు సిద్ధమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. పరీక్షలకు అవసరమైన రైటింగ్ ప్యాడ్, పెన్లు మరియు ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకుని పరీక్షా కేంద్రాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. ఇంటి నుండి బయలుదేరే ముందు హాల్ టికెట్‌తో పాటు ఇతర అవసరమైన పత్రాలు మరియు వస్తువులు తమ వద్ద ఉన్నాయో లేదో తప్పకుండా ఒకసారి పరిశీలించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పరీక్షా హాల్లోకి వెళ్లిన తర్వాత తొందరపడకుండా ప్రశాంతంగా ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా ఒకసారి చదివి, ప్రశ్నలను అర్థం చేసుకుని తరువాత సమాధానాలు రాయడం ప్రారంభించాలని సూచించారు. సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. అదేవిధంగా పరీక్షల సమయంలో విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పరీక్షా కేంద్రాల వద్ద ప్రశాంతమైన వాతావరణం ఏర్పడేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ శబ్దాన్ని నియంత్రించడం, విద్యుత్ అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడడం, విద్యార్థులకు తగిన త్రాగునీటి సదుపాయం కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించేలా ట్రాఫిక్ పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి తమ లక్ష్యాలను సాధించాలని డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ ఆకాంక్షించారు. అలాగే విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చాలని ఆయన కోరారు.

## చట్టవిరుద్ధంగా చెట్లను నరికివేసే వారికి చట్టబద్ధంగా గుణపాఠం నేర్పిస్తాం





బెంగళూరు జై భీమ్ న్యూస్ :

చట్టవిరుద్ధంగా చెట్లను నరికివేసే వారికి చట్టబద్ధంగా గుణపాఠం నేర్పిస్తామని స్థానిక జోన్ ఫారెస్ట్ ఆఫీసర్ ఆశా హెచ్చరించారు. కృష్ణరాజపుర ప్రభుత్వ హాస్పిటల్ ప్రాంగణంలో పరిసర మంజునాథ్ నేతృత్వంలో మిడిటా ఫౌండేషన్ నిర్వహించిన వృక్ష రక్షా బంధన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చిన్న చిన్న సాకులు చెప్పి చెట్లు నరకడం, నరకనివ్వడం తగదు. ప్రతి ఒక్కరూ చెట్ల ప్రాముఖ్యతను అర్థం చేసుకుని, చెట్లను కాపాడటానికి పరిసర మంజునాథ్ వ్యక్తి లాంటి వైఖరిని పెంపొందించుకోవాలి. వృక్ష బచావో ఆందోళన్ సమితి అధినేత పరిసర మంజునాథ్ మాట్లాడుతూ, చెట్ల రక్షణ కోసం వృక్ష రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా చెట్లను నరికివేయకూడదని ప్రభుత్వం దృష్టికి అవగాహన కల్పించే ప్రయత్నం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా పరిసర మంజునాథ్ పుట్టినరోజు వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించారు హానికరం లాంటి కేక్ కట్ చేయకుండా పుచ్చకాయ కోసి అందరికీ తినిపించి ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిసర మంజునాథ్ 101 మొక్కలు పంపిణీ చేసి, మొక్కలు నాటారు మరియు పర్యావరణ సేవా పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఎం.ఎన్.మహదేవ్ గౌడ్, నాయకులు మారెప్ప, కురుదుసోనేహళ్లి సూరి, ఎం.ఆర్.వెంకటేష్, గంధర్వ రమేష్, బెన్నిగేనహళ్లి రవి, దేవరాజ్ సూర్యవంశీ, మునిమారప్ప, జైభీం శ్రీనివాస్, లక్ష్మణ్, కృష్ణమూర్తి, ఆదూరు దేవరాజ్, భాగ్య, దేవీలయ, సౌమ్య కె. పవార్‌కర, సహిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ ఫిరాయింపులు... రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతబట్టి దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని, కానీ ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం ప్రభుత్వం మరోలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీపై, కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పిందని గుర్తు చేశారు. అలాగే రాహుల్ గాంధీ కూడా దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని అన్నారు. కానీ తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని అన్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించడమే రాజ్యాంగాన్ని రక్షించడమా అని ఎద్దేవా చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు.

# మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు..

**పేదలను దెబ్బతీస్తే మాత్రం పోరాటమే: రాంచందర్ రావు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తమ పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము మూసీ నది శుద్ధికి లేదా అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు కౌంటర్‌గా మాట్లాడిన ఆయన, మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు. అయితే, 'గాంధీ సరోవర్' వంటి ప్రాజెక్టుల కోసం మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఉదాహరణగా తీసుకునే వారు, అక్కడ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలను గమనించాలని రాంచందర్ రావు హితవు పలికారు. అక్కడ సుమారు 4 వేల కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దెబ్బతీయకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. గాంధీ విగ్రహాన్ని ఎంత ఎత్తులో నిర్మించినా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం పోరాటం తప్పదని హెచ్చరించారు. మరోవైపు, దేశంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. అంతర్జాతీయంగా యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే సంబంధిత దేశాలతో మాట్లాడి చమురు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం కేవలం ఒక ప్రాంతంపైనే ఆధారపడదని, 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచి వస్తుందని చెప్పారు. రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ గ్యాస్, పెట్రోల్ కొరత మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.



## వాహన రిజిస్ట్రేషన్‌లో కొత్త రూల్.. ఇక అంతా ఆన్‌లైనే!

**వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇకపై పూర్తి ఆన్‌లైన్**
**డీలర్లు వసూలు చేసే అదనపు ఛార్జీలకు అడ్డుకట్ట**
**ఆర్‌టీఏ కార్యాలయాలకు వెళ్లకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి**
**నేటి నుంచే పత్రాల డిజిటల్ అప్‌లోడ్ విధానం అమలు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తెలంగాణ రవాణా శాఖ కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. షోరూమ్ డీలర్లు 'హ్యాండ్లింగ్ ఛార్జీల' పేరుతో చేస్తున్న అదనపు వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేసింది. ఇకపై వాహన రిజిస్ట్రేషన్ కోసం ఎలాంటి పత్రాలను భౌతికంగా ఆర్‌టీఏ కార్యాలయాల్లో సమర్పించాల్సిన అవసరం లేదని, అంతా ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయాలని రవాణా శాఖ కమిషనర్ కె. ఇలంబరిది ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కొత్త నిబంధనలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఇప్పటివరకు వాహన కొనుగోలుదారుల నుంచి రిజిస్ట్రేషన్ పేరుతో డీలర్లు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. బైక్‌లకు రూ.1000, కార్లకు రూ.5000 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు క్షేత్రస్థాయి విచారణలో తేలింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వాహనం ఎక్స్-షోరూమ్ ధర మినహా ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడం చట్టవిరుద్ధం. ఈ నేపథ్యంలో, అక్రమాలకు తావులేని పారదర్శక విధానాన్ని తీసుకువచ్చారు. కొత్త విధానం ప్రకారం వాహన యజమాని సంతకాలతో కూడిన ఫారం-20 సహా అన్ని పత్రాలను డీలర్లు తమ లాగిన్ల ద్వారా స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. మార్చి 13 నుంచి తాత్కాలిక రిజిస్ట్రేషన్ (౧=) పొందిన వాహనాలకు సంబంధించిన భౌతిక పత్రాలను ఆర్‌టీఏ కార్యాలయాలు స్వీకరించవు. ఈ మార్పుల వల్ల వాహనదారులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పని తప్పుతుంది. రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించిన వెంటనే షోరూమ్‌లోనే హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ (నూచీూ) అమర్చే సౌకర్యం కూడా అందుబాటులోకి రానుంది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల ఎఫెక్ట్..


**గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు**

ఢిల్లీ, హైదరాబాద్

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. వంట గ్యాస్ కొరత కారణంగా గృహ వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గ్యాస్ ఇళ్ల వరకు రావడానికి రోజుల సమయం పడుతుండటంతో వినియోగదారులు వివిధ ప్రాంతాల్లో గ్యాస్ గోడౌన్ల వద్దకు వచ్చి క్యూ కడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో, జనగాం జిల్లా రఘునాథపల్లిలో వంట గ్యాస్ కోసం ప్రజలు సిలిండర్లతో బారులు తీరారు. మూడు రోజుల క్రితం గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ రాలేదని వరుసలో నిలబడిన వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## పదో తరగతి పరీక్షలకు హనుమకొండ జిల్లాలో పూర్తి ఏర్పాట్లు : డీఈవో ఎల్.వి. గిరిరాజ్ గౌడ్




హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)

మార్చి--2026లో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని 317 పాఠశాలల నుండి మొత్తం 12,079 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. విద్యార్థుల హాల్ టికెట్లను ఇప్పటికే సంబంధిత పాఠశాలలకు పంపించామని, అందని వారు ఘఘ.ఎంవ్.వశ్రీఖఅస్త్రుఖఋ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలకు అవసరమైన 24 పేజీలు, 12 పేజీల ఆన్సర్ బుక్‌లెట్లు కూడా పంపించినట్లు చెప్పారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయగా, 64 పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పోలీస్ శాఖతో పాటు ఇతర శాఖల సహకారంతో లోపల, బయట మూడు స్థాయిల భద్రతను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన అభ్యర్థులపై జి.ఓ.ఆర్టీ.నం.872/ఈడిఎన్, ఎడ్యుకేషన్ ఎగ్జామ్స్ డిపార్ట్మెంట్, 16-05-1992, తెలంగాణ పబ్లిక్ ఎక్సమినేషన్స్ యాక్ట్ --1997 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకునేందుకు టీఎస్ఆర్టీసీ అధికారులు అవసరమైనన్ని బస్సులు నడపాలని కోరినట్లు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రంలో ఒక ఏఎన్ఎమ్‌ను నియమించామని తెలిపారు. పరీక్షలు పూర్తైన అనంతరం ఆన్సర్ పేపర్లను మూల్యాంకన కేంద్రాలకు సురక్షితంగా పంపించేందుకు పోస్టల్ శాఖకు తగు సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలు చేయాలని, అలాగే జిరాక్స్ సెంటర్లు పరీక్ష సమయం పూర్తయ్యే వరకు మూసివేయాలని జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ శాఖను కోరినట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే 7981767208 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు పరీక్షా రోజుల్లో ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 9.35 తర్వాత కేంద్రంలోకి అనుమతి ఉండదని డీఈవో తెలిపారు. సెల్‌ఫోన్లు, క్యాలికులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు పుకారులను నమ్మి పిల్లల్లో భయాందోళన కలిగించకూడదని, పరీక్షలకు ముందుగానే కేంద్రాలకు పంపించాలని, అవసరమైన స్టేషనరీ తీసుకెళ్లేలా చూడాలని డీఈవో ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ సూచించారు.

# విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

**విద్యార్థి సంఘాల ఆగ్రహం**
**ఉద్యోగాల కోసం శాంతియుత నిరసన చేయడం నేరమా..? అని ప్రశ్న**

**హైద్రాబాద్, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



ప్రజాపాలన పేరుతో విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు చర్య అని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను సక్రమంగా అమలు చేసి వెంటనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి పోలీసులు విద్యార్థి నాయకులను తెల్లవారుజామునే అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు విమర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా తమ భావప్రకటన స్వేచ్ఛను వ్యక్తం చేయడం విద్యార్థులు, నిరుద్యోగుల రాజ్యాంగ హక్కు అని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఏడవ గ్యారంటీగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని మరిచిపోయిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ కాలంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన నియామక పత్రాలు ఇచ్చి బాధ్యత పూర్తయిందన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్న నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రేపు విద్యార్థి, నిరుద్యోగుల ఆధ్వర్యంలో జరగబోయే టీజీపీఎస్సీ ముట్టడికి విద్యార్థులు, నిరుద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్ఎస్యు జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయి కుమార్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నేరెళ్ల గ్రామంలో కోతుల బెడదకు చెక్ పెట్టిన సర్పంచ్ జట్టి నాగలక్ష్మి : సురేష్

**హన్మకొండ, 13 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని నేరెళ్ల గ్రామంలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ జట్టి నాగలక్ష్మి--సురేష్ దంపతులు పాలకవర్గంతో కలిసి తక్షణ చర్యలు చేపట్టి ఉపశమనం కలిగించారు. గ్రామ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి స్పందిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా ప్రజాప్రతినిధులు ప్రజలకు అండగా నిలవాలనే సందేశాన్ని వారు ఇచ్చారు. గత కొన్ని రోజులుగా గ్రామంలో కోతులు అధికంగా సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకుపోవడం, ఇంటి పైకప్పులు, విద్యుత్ తీగలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కోతులు ఇళ్లలోని ఆహార పదార్థాలను ఎత్తుకుపోవడం, బట్టలు పాడుచేయడం, పళ్ల తోటలు మరియు కూరగాయల తోటలను నాశనం చేయడం వంటి సమస్యలు పెరగడంతో గ్రామ ప్రజలు ఈ విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకున్న సర్పంచ్ జట్టి నాగలక్ష్మి--సురేష్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక చర్యలు చేపట్టి కోతులను పట్టుకునే ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో అడవిశాఖ అధికారులను సంప్రదించి ప్రత్యేక బృందాన్ని గ్రామానికి రప్పించారు. గ్రామంలో సంచరిస్తున్న కోతులను పట్టుకుని అడవుల్లోకి తరలించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ చర్యలతో గ్రామ ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ జట్టి నాగలక్ష్మి సురేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే గ్రామ పంచాయతీకి తెలియజేయాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యత అని, గ్రామ అభివృద్ధి మరియు ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. కోతుల బెడద పూర్తిగా నివారించే దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు సర్పంచ్ తీసుకున్న తక్షణ చర్యలను అభినందిస్తూ, ప్రజల సమస్యల పట్ల స్పందించి వెంటనే పరిష్కారం చూపడం ఇతర ప్రజాప్రతినిధులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

**రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
**ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,“మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు”,సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన**

**రామగుండం, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**





గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,“మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు”, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని,ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమలో ఉన్న అపారమైన శక్తిని సరైన దిశలో వినియోగించుకోవాలని తెలిపారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం, శక్తిని క్రీడలు,చదువు మరియు సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని, ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారును నడిపే సమయంలో సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని, భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్‌లను తీసుకోవద్దని చెప్పేవారని, ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు,మెసేజ్‌ల రూపంలో జరుగుతోందని వివరించారు.మొబైల్ ఫోన్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం సాధ్యమవుతున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరస్థులకు కూడా అవకాశం కలుగుతుందని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌ను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని,అప్రమత్తంగా ఉంటేనే నేరాల నుంచి రక్షణ పొందగలమని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పోలీస్ కళాబృందం పాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ డ్రగ్స్ వినియోగం--అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ప్రవచనకర్త ఎస్.పి. నాయక్ బంజారా, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐలు రమేష్, అనూష, పోలీస్ సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# లెప్రసీ, ఫైలేరియా కేసులపై డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి సమీక్ష

**హసన్ పర్తి పీహెచ్‌సీ సందర్శన**



**హసన్ పర్తి, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హసన్ పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) ప్రతినిధి డాక్టర్ శిరీష శుక్రవారం సందర్శించి లెప్రస, ఫైలేరియా కేసుల గుర్తింపు, చికిత్సా విధానాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రసీ కేసు డిటెక్షన్ సర్వే నిర్వహణ, ఫైలేరియా కేసుల గుర్తింపు, నమోదైన కేసుల వివరాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఫాలోఅప్ పరీక్షలు వంటి అంశాలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హసన్ పర్తి --1, హసన్ పర్తి --2 పరిధిలో ఉన్న లెప్రసీ, ఫైలేరియా రోగులను ప్రత్యక్షంగా కలుసుకుని వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ, పర్యవేక్షణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు గ్రామస్థాయిలో ఎలా అమలవుతున్నాయో, ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేలు, రోగుల పర్యవేక్షణ విధానాలు గురించి కూడా పరిశీలించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, రోగులను గుర్తించి తక్షణ చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రామ్ భార్గవ్, డాక్టర్ భరత్, హెచ్ఈఈఓ సందెల శ్రీనివాస్, డిపిఎంఓ రవీందర్, సతీష్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు ఖాదర్ అబ్బాస్, విప్లవ కుమార్, హెల్త్ సూపర్వైజర్లు కె. రమేష్, లక్ష్మణ్, హెల్త్ అసిస్టెంట్లు సుమన్ కుమార్, మొహసిన్, ఇంద్రారెడ్డి, సిస్టర్లు సులోచన, విజయనిర్మల, సుకన్య, రజిత, ఆశా కార్యకర్తలు, రోగులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. హిమబిందు**





**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

మార్చి 24న జరగనున్న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండలోని కాకతీయ మెడికల్ కాలేజీ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా. హిమబిందు మాట్లాడుతూ క్షయ వ్యాధిని నివారించాలంటే ముందుగా దాన్ని త్వరగా గుర్తించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, తేమడలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో తేమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా పూర్తి కాలపరిమితి వరకు వాడితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని చెప్పారు. మధ్యలో మందులు ఆపితే వ్యాధి ముదిరి ప్రాణాంతక టిబిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, దగ్గు వచ్చినప్పుడు రుమాలు లేదా మాస్క్ ఉపయోగించడం ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని వివరించారు. టిబి బాధితులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని, అలాగే వారి పోషకాహారం కోసం నెలకు రూ.1000 చొప్పున ఆరు నెలల పాటు నేరుగా వారి ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ టి. సునీత, నర్సింగ్ ట్యూటర్స్ వి. అనురాధ, వి. సుకన్య, జిల్లా టిబి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు వి. సుష్మా, పి. కిరణ్ కుమార్, డి. నగేష్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్లు టి. విజయ్, సతీష్, హెల్త్ విజిటర్స్ అంజమ్మ, సునీతతో పాటు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది: అమిత్ షాకు కేటీఆర్ లేఖ

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు. తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# కవిత జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

**హనుమకొండలో తెలంగాణ జాగృతి సేవా కార్యక్రమం**





**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లాలో తెలంగాణ జాగృతి నాయకత్వంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలంపల్లి రమేష్, గుండ్రెడ్డి రోహిత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కవిత జన్మదినం రోజున రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో సేవాభావాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ప్రస్తుతం రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో ఈ శిబిరంలో సుమారు 30 యూనిట్ల రక్తాన్ని సేకరించడం అభినందనీయమని అన్నారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన పోలంపల్లి రమేష్, గుండ్రెడ్డి రోహిత్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తెలంగాణ జాగృతి ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు కల్వకుంట్ల కవిత అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలంగాణ సమాజానికి సేవలందిస్తున్నారని చెప్పారు. ఆమె చేస్తున్న సామాజిక పోరాటం కారణంగా తెలంగాణ ప్రజలు ఆమెను ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా రూపుదిద్దుకొని సామాజిక తెలంగాణ లక్ష్యంతో యువత, మహిళలకు పెద్దపీట వేయాలని కవిత సంకల్పించారని తెలిపారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను కలుపుకొని సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మే నెల మొదటి వారంలో రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆమె నాయకత్వంపై విశ్వాసంతో వివిధ వర్గాల ప్రజలు ఆ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నాయకత్వంలో కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా నాయకులు మంజుల రావు, చిగుమల్ల మౌనిక, రాధాకృష్ణ, దయ్యాల నాగరాజు, ప్రవీణ్ యాదవ్, రత్నాకర్, బుర్రి ప్రభు తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన జాగృతి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యారంగానికి 30శాతం బడ్జెట్ కేటాయించాలి

**ఏఐఎస్ఎఫ్ డిమాండ్**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేత**



**హన్మకొండ, 13 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ను కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, హాస్టళ్లలో వసతుల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు ఆలస్యం వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్ మాట్లాడుతూ ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వాస్తవానికి విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూల విధానాలు అమలు చేయడం వల్ల సాధారణ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ హక్కు అని, దాన్ని వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే భవిష్యత్తులో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ తరఫున ప్రభుత్వం ముందు పలు ప్రధాన డిమాండ్లు ఉంచారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో మెరుగైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులేని, కనీస మౌలిక సదుపాయాలు లేని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను మూసివేయాలని, షూ, టై, బెల్ట్, పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల నుంచి అధికంగా వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బొజ్జు జ్యోతి, జక్కుల భానుప్రసాద్, సిపతి వినయ్, జిల్లా సమితి సభ్యులు సిహెచ్ వంశీ కుమార్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో జియాలజీపై రెండు రోజుల జాతీయ సదస్సు

**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం జియాలజీ విభాగం ఆధ్వర్యంలో "రీసెంట్ అడ్వాన్సస్ అండ్ ఛాలెంజస్ ఇన్ జాలజీ " అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు మార్చి 16వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ భౌతిక శాస్త్ర విభాగ సెమినార్ హాల్‌లో ప్రారంభమవుతుంది. జాతీయ సదస్సు ప్రారంభ సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అడిషనల్ డైరెక్టర్ జనరల్ విజయ్ వి. ముగల్ విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి క్యాంపస్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య వి. మాదవన్, ఆచార్య కే. నరేందర్ రెడ్డి, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.వి. శేష సాయి, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు ఆచార్య ఎం.ఎ. మొహమ్మద్ అస్లాం అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ విషయాన్ని జియాలజీ విభాగాధిపతి, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.

# కీసరగుట్ట వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు నేడు కీసరగుట్టలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత క్షేత్రస్థాయిలో వేద విద్యా సంస్థలను సందర్శిస్తున్న ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, వేద పాఠశాల చరిత్ర, ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. పాఠశాల ప్రిన్సిపాల్ గూడ శ్రీనివాస శర్మతో మాట్లాడిన చైర్మన్, ప్రస్తుతం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలను, వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. పురాతన వేద సంపదను కాపాడుకోవడంలో వేద పాఠశాలల పాత్ర కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వేద విజ్ఞానాన్ని భావితరాలకు అందించడంలో టీటీడీ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పాఠశాలలోని సౌకర్యాల పట్ల విద్యార్థులు మరియు అధ్యాపకులు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో పాఠశాల సిబ్బందితో పాటు ఇంజనీరింగ్ అధికారులు డీఈ రామకృష్ణ, జేఈ చలమా నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేయూలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు యూనియన్ వినతి**



**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో గత 20--25 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ రైట్స్ యూనియన్ నాయకులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, 2021 జూన్ 11న జారీ చేసిన జి.ఓ.ఎంఎస్.నం.60 అమలు సమయంలో కాకతీయ విశ్వవిద్యాలయంలోని మొత్తం 497 మంది బోధనేతర ఉద్యోగులను 167 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా, 330 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా విభజించారని తెలిపారు. ఈ నిర్ణయంతో చాలా కాలంగా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ సీనియారిటీతో పాటు సేవా ప్రయోజనాలను కోల్పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకుని యూనివర్సిటీ ద్వారా జీతాలు చెల్లించాలని, అలాగే వారిని స్కిల్డ్, సెమీ-స్కిల్డ్, అన్-స్కిల్డ్ కేటగిరీలుగా వర్గీకరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జి.ఓ.ఆర్టీ.నం. 4459 ప్రకారం సంవత్సరానికి 15 రోజుల వేతనంతో కూడిన సెలవులు, మెడికల్ లీవ్ మరియు ఇతర అలవెన్సులు అమలు చేయాలని కోరారు. ఇంకా ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఈపిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగి మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న టైమ్ స్కేలు లేదా రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసే సమయంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మచ్చ రత్నాకర్, అధ్యక్షుడు చెతెల్ల రామకృష్ణతో పాటు యూనియన్ సభ్యులు రవి, కృష్ణంరాజ్, ప్రనూప్, మధు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతతో మహిళల్లో సాధికారత పెంపొందాలి: కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి

**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**




ఆధునిక సాంకేతికత ద్వారా మహిళల్లో సాధికారతను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మహిళా ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రిన్సిపాల్ ఆచార్య కే. భిక్షాలు ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం మహిళలకు విద్య, ఉపాధి, స్వయం సమృద్ధి దిశగా కొత్త అవకాశాలను అందిస్తుందని తెలిపారు. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ స్కిల్స్ వంటి రంగాల్లో మహిళలు ముందుకు వస్తే సమాజ అభివృద్ధిలో వారి పాత్ర మరింత బలపడుతుందని పేర్కొన్నారు. మహిళలు సాంకేతిక విద్యపై ఆసక్తి పెంచుకుని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఆర్థికంగా, సామాజికంగా మరింత సాధికారతను సాధించగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్ఐటి వరంగల్ ఈసీఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వి. రామ హాజరై "మహిళల సాధికారత మరియు సాంకేతిక రంగాలలో మహిళల పాత్ర" అనే అంశంపై ప్రసంగించారు. మహిళల సాధికారతకు విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కీలకమని, టెక్నాలజీ రంగంలో మహిళలు ముందుకు రావడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక స్థితి మరింత బలపడుతుందని అన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా డా. టి. అర్చన వ్యవహరించగా, సమన్వయకర్తలుగా ఎస్. సహితి, ఎ. శ్రీజా వ్యవహరించారు.

# రాజనాల శ్రీహరి చేతుల మీదుగా జేబి ఉగాది పురస్కారాల కరపత్ర ఆవిష్కరణ



**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉగాది పురస్కారాలు -- 2026 కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజనాల శ్రీహరి మాట్లాడుతూ, రెండున్నర దశాబ్దాలుగా జేబీ కల్చరల్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాకారులను, వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులను గుర్తించి పురస్కారాలు అందజేస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల శివ సేవలను ఆయన ప్రశంసించారు. ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం నుంచి నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా కవితా రచన, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు జడల శివ తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు "సకల కళల జాతర -- 2026" పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా కళాప్రియులు, విద్యార్థులు పాల్గొనవచ్చని ఆయన సూచించారు. ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సిరిమల్లె కుమారస్వామి, బొల్లం మధు, సోల విజయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు

**సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత**

**వరంగల్, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సెక్షన్ 163 బిఎన్ఎన్ఎస్ (మునుపటి సెక్షన్ 144) ప్రకారం పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులు గుమికూడటం, అనవసరంగా తిరగడం వంటి చర్యలను నిషేధించినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయేందుకు పోలీస్ శాఖ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టిందని డీసీపీ వెల్లడించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


# ఇంటర్ విద్యార్థులకు పింగిళి డిగ్రీ కళాశాల ప్రాధాన్యత వివరించిన అధ్యాపకులు


**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**




పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) అధ్యాపకులు వివిధ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులను కలుసుకుని తమ కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా అవకాశాల గురించి వివరించారు. కళాశాల ప్రాధాన్యతను తెలియజేస్తూ కరపత్రాలను విద్యార్థులకు అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. పింగిళి డిగ్రీ కళాశాల అధ్యాపకులు వడ్డేపల్లి పింగిళి ప్రభుత్వ జూనియర్ కళాశాల, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇతర జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులకు కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సదుపాయాల గురించి వివరించారు. కళాశాలలో బి.ఎ, బి.కాం, బి.బి.ఎ, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ వంటి కోర్సులతో పాటు ప్రస్తుత కాలానికి అనుగుణంగా అత్యాధునిక కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పింగిళి కళాశాలకు జాతీయ స్థాయి న్యాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు, అటానమస్ హోదా, నాణ్యతా ప్రమాణాలను గుర్తించే ఐఎస్ఓ సర్టిఫికేషన్ ఉన్నాయని చెప్పారు. కళాశాలలోని అధ్యాపకులు నెట్, సెట్, ఎంఫిల్, పిహెచ్‌డీ వంటి ఉన్నత విద్యార్హతలతో పాటు దశాబ్దాల బోధనానుభవం కలిగి ఉన్నారని వివరించారు. సువిశాలమైన రెండంతస్తుల భవనం, అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, అత్యాధునిక లైబ్రరీ, వర్చువల్, డిజిటల్, స్మార్ట్ తరగతి గదులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సివిల్స్, గ్రూప్స్, పోలీస్, ఆర్మీ, అగ్నివీర్, బ్యాంకింగ్ వంటి వివిధ పోటీ పరీక్షలకు కెరీర్ గైడెన్స్ సెల్, టీఎస్‌కేసీ, టాస్క్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నిరంతరం నిర్వహించే జాబ్ మేళాల ద్వారా ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు తమ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో చేరి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. డి. సురేశ్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, పీడీ సుజాత, ఎస్. మధు, డా. కె. శ్రీనివాస్, డా. లకన్ సింగ్, బాలరాజు, పద్మ, రామ్ రెడ్డి, రమేష్ కుమార్, ఉదయశ్రీ, డా. సునీత, రాజేశ్వరి, డా. రేణుక, లక్ష్మీకాంతం, శ్యామ్ ప్రసాద్ రెడ్డి తదితర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు





### వదంతులను నమ్మొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, గ్యాస్ సరఫరాపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర పౌర సరఫరాలు, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు మరియు సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, అదనపు కలెక్టర్ ఎన్. రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గ్యాస్ కొరత ఉందని జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల కారణంగా గ్యాస్ కొరతపై అపోహలు సృష్టించబడుతున్నాయని ఆయన అన్నారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, ఆశ్రమాలకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్న హై లెవల్ కమిటీ పరిస్థితిని పర్యవేక్షిస్తోందని చెప్పారు. అమెరికా--ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడిందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేలా జరుగుతున్న ప్రచారాన్ని అధికార యంత్రాంగం సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 810 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. రోజుకు సుమారు 2.5 లక్షల గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతోందని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని అక్రమంగా గ్యాస్ నిల్వ చేయడం, మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై 288 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అవసరమైతే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిని రోజువారీగా సమీక్షించాలని సూచించారు. పట్టణాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి ఎల్పీజీ సిలిండర్ బుక్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ యాసంగి ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ సంచులు, నిల్వ సదుపాయాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాల్లో వరి సాగు పెరిగిందని, పంటల పరిస్థితిని బట్టి సాగునీరు అందిస్తూ వైవిధ్య పంటలను ప్రోత్సహించాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు కొన్ని జిల్లాల్లో ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ, అన్ని జిల్లాల్లోనూ విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఎల్పీజీ గ్యాస్ సరఫరా, సాగునీటి నిర్వహణ, ఆయిల్ పామ్ పంటల సాగుపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌తో పాటు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సుధీర్, జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మార్కెటింగ్ అధికారి అనురాధ, మార్క్‌ఫెడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాహితీ యోధుడు మెండు ఉమామహేశ్వరరావుకు అశ్రునివాళి

**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ఇటీవల మరణించిన ప్రముఖ కవి, రచయిత, పూర్వ పాత్రికేయుడు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు మెండు ఉమామహేశ్వరరావుకు శ్రద్ధాంజలి కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఒక ప్రైవేటు హాల్‌లో అశ్రునయనాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు, పాత్రికేయులు, బంధుమిత్రులు ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు శెంకేసి శంకర్‌రావు మాట్లాడుతూ స్వర్గీయ ఉమామహేశ్వరరావు తాను పనిచేసిన ప్రతి రంగంలో క్రమశిక్షణతో, నిజాయితీతో, బాధ్యతాయుతంగా వ్యవహరించేవారని తెలిపారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడుతూ, ఆయన మరణం సమాజానికి తీరని లోటు అని అన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ మరో ఐదు నెలల్లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా ఉమామహేశ్వరరావు అకాల మరణం చెందడం విద్యాశాఖకు, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ శ్రద్ధాంజలి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గీతా దేవి, హారిక, రఘు, ప్రణయ్, జయశ్రీ, ప్రణీత్, సృజన, ధనలక్ష్మి, కళావతి, సాంబశివుడు, మైమ్ కళాధర్, హనుమకొండ ఎంఈఓ నెహ్రూ నాయక్, ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, సుధాకర్, పాత్రికేయుడు మెండు రవీందర్‌తో పాటు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు, రచయితలు, బంధుమిత్రులు పాల్గొని ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.






## ఎల్పీజీ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా సక్రమంగా కొనసాగి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సూచించారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఎనర్జీ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డీసీపీ అంకిత్ కుమార్, ఎల్పీజీ డీలర్లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎనర్జీ మానిటరింగ్ కమిటీలో జిల్లా ఎస్పీ లేదా పోలీస్ కమిషనర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సంక్షేమ అధికారులు (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ), ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ ప్రతినిధులు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. సమావేశంలో జిల్లాలో ఎల్పీజీ పంపిణీ, నిల్వలు, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు అందుతున్న సేవలపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ తగినంత అందుబాటులో ఉందని, కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత కమిటీపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్యాస్ కొరతను కృత్రిమంగా సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు నిర్వహించినట్లయితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 15 ఎల్పీజీ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని తెలిపారు. గృహ వినియోగానికి సంబంధించిన 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ కనెక్షన్లు 3,15,056 ఉన్నాయని, కమర్షియల్ వినియోగానికి సంబంధించిన 19 కిలోల సిలిండర్ కనెక్షన్లు 1,452 ఉన్నాయని వెల్లడించారు. అలాగే దీపం పథకం కింద 61,913 కనెక్షన్లు, ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయూవై) కింద 4,179 కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. ఎల్పీజీ కంపెనీల మార్గదర్శకాల ప్రకారం గృహ వినియోగ సిలిండర్ తదుపరి బుకింగ్‌కు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల కాలపరిమితి ఉండే విధంగా నిబంధనలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఎల్పీజీ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్యాస్ సరఫరా జరిగేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా సంబంధిత సంక్షేమ అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎనర్జీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఎల్పీజీ డీలర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ పథకం: అర్హతలు, ఈకేవైసీ తప్పనిసరి

### 22వ విడత నిధులు విడుదల




**హైద్రాబాద్, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

దేశవ్యాప్తంగా రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పిఎం - కిసాన్) పథకం కింద 9 కోట్ల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఈరోజు (మార్చి 13) అసోంలోని గువహటీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 22వ విడత నిధులను విడుదల చేయనున్నారు. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు ప్రతి సంవత్సరం రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా రూ.2,000 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. అధికారిక వెబ్‌సైట్ ప్రకారం ఇప్పటివరకు ఈ పథకం కింద మొత్తం రూ.4.25 లక్షల కోట్లకు పైగా రైతులకు పంపిణీ చేశారు. 2025 నవంబర్‌లో తమిళనాడు కోయంబత్తూర్‌లో జరిగిన కార్యక్రమంలో గత విడతగా రూ.18,000 కోట్లను 9 కోట్ల మందికి పైగా రైతులకు జమ చేశారు. ఈ పథకం ద్వారా 2.15 కోట్ల మహిళా రైతులు కూడా లబ్ధి పొందుతున్నారు. పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే రైతు పేరుతో వ్యవసాయ భూమి ఉండాలి. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారు ఈ పథకానికి అర్హులు కారరు. రైతు ఆధార్ కార్డు మరియు బ్యాంకు ఖాతా వివరాలు తప్పనిసరి. అలాగే రైతు ఫార్మర్ ఐడీ కూడా అవసరం. ఈ పథకం కింద నిధులు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి. అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఓటీపీ లేదా బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాతే రైతుల ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) ద్వారా నిధులు జమ అవుతాయి. రైతులు తమ పేమెంట్ లేదా అర్హత స్థితిని తెలుసుకోవాలంటే అధికారిక వెబ్‌సైట్ జూఎని-అయిఖఅ.స్త్రశీజ.ఉఅ లో 'ఖఅశీష్‌శీబతీ ౕఘ్‌బం' లేదా 'దీవఅవటఅషెఖుతీఎ నాఅర్' ఎంపిక ద్వారా స్టేటస్ చెక్ చేసుకోవచ్చు. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేసి 'గేట్ రిపోర్ట్ ' క్లిక్ చేస్తే గ్రామాల వారీగా లబ్ధిదారుల వివరాలు కనిపిస్తాయి. అలాగే కిసాన్ ఇమిత్ర అనే చాట్‌బాట్ ద్వారా ఏఐ సహాయంతో 11 స్థానిక భాషల్లో రైతుల సందేహాలకు సమాధానాలు అందిస్తున్నారు. రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించే ముఖ్యమైన కేంద్ర పథకాలలో పీఎం కిసాన్ ఒకటిగా నిలుస్తోంది. 2026 ఫిబ్రవరి 24 నాటికి ఈ పథకం ప్రారంభించి ఏడు సంవత్సరాలు పూర్తయ్యాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం

**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, జాతీయ సాంకేతిక విద్య కళాశాల ప్రొఫెసర్ వి.రామ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారతకు విద్య ప్రధాన సాధనమని పేర్కొన్నారు. మహిళలకు విద్య అందితే కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించిందని, మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉందన్నారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని, మహిళల సాధికారత లేకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో సుమారు 60 శాతం మహిళలు వ్యవసాయ కార్యకలాపాలలో పాల్గొంటున్నప్పటికీ వారికి సరైన గుర్తింపు, ఆర్థిక ప్రయోజనాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. మహిళా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయడానికి అనుమతి లభించిందని, కళాశాలలో అకాడమిక్ బ్లాక్ నిర్మాణం మరియు బాలికల కోసం ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు కోసం సుమారు రూ.50 కోట్లు కేటాయించబడినట్లు తెలిపారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ వి.రామ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా మహిళా శ్రామిక దినోత్సవంగా భావిస్తానన్నారు. మహిళలు కుటుంబం, సమాజం, ఉద్యోగ రంగాలలో నిరంతరం కృషి చేస్తూ సమాజ అభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నారని చెప్పారు. "గివ్ టు గెయిన్" అనే భావనతో సమాజానికి సేవ చేయడం ద్వారా నిజమైన గౌరవం, అభివృద్ధి పొందవచ్చని తెలిపారు. ప్రపంచ జనాభాలో సగం మహిళలే ఉన్నప్పటికీ ఇంకా సమాన స్థాయి సాధించలేదని, జెండర్ గ్యాప్, ఎంప్లాయిమెంట్, హెల్త్, పొలిటికల్ ఎంపవర్మెంట్ అంశాల ఆధారంగా చేసిన సర్వేలో 148 దేశాలలో భారతదేశం 131వ స్థానంలో ఉందని వివరించారు. మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి పరిశోధన రంగాలలో ముందుకు రావాలని సూచించారు. ఆత్మవిశ్వాసం, కృషి ఉంటే ఎలాంటి లక్ష్యమైనా సాధించవచ్చని విద్యార్థినులకు ప్రేరణనిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో నైపుణ్యాలు పెంపొందించుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టీ.అర్చన మాట్లాడుతూ మహిళలు ఉన్నత ఆశయాలతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన స్కిట్‌లు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం స్థానిక ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఆలయానికి ఆహ్వానించి సన్మానించారు. ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తౌనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, గాండ్ల స్రవంతి, జారతి వెంకటేశ్వర్లు, బింగి సతీష్, పాలడుగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కేయూని సందర్శించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**హన్మకొండ, మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్--నల్గొండ--ఖమ్మం గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్‌తో పాటు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కలిసి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను శాలువా, బొకే మరియు జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. అనంతరం విశ్వవిద్యాలయం సెనెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో తీన్మార్ మల్లన్న, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సమక్షంలో విద్యార్థులు మరియు ఉద్యోగులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యా, పరిపాలనా సంబంధిత అంశాలపై చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి బీసీ సెల్ సంచాలకులు డా. బి. సతీష్ సంయోజకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పింగిళి కళాశాలలో ఫ్రూట్స్ గార్డెన్ ఏర్పాటు... నాటిన 60 రకాల పండ్ల మొక్కలు



**హన్మకొండ, 13 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రూట్స్ గార్డెన్ ఏర్పాటు చేస్తూ మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "99 డే ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక"లో భాగంగా, అలాగే కళాశాల 60 వసంతాల సందర్భంగా కళాశాల ఆవరణలో 60 రకాల పండ్ల మొక్కలను నాటడం జరిగిందని తెలిపారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పుట్టినరోజులు జరుపుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, అధ్యాపకులు బాలరాజు, డా. లక్ష్మీకాంతం, డా. సునీత, డా. సామ్యూల్ ప్రవీణ్ కుమార్, రమేష్ కుమార్ తదితరులు అందించిన పండ్ల మొక్కలను నాటడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించడానికి ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, ఎకో క్లబ్ కన్వీనర్ డా. శ్రీలత, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. మమత, రామా రత్నమాల, అధ్యాపకులు పీడీ సుజాత, ఎస్. మధు, డా. పి. అరుణ, డా. శ్రీనివాస్, డా. సారంగపాణి, ఉదయశ్రీ, రామ్ రెడ్డి, డా. రాజు తదితర విభాగాల అధిపతులు, బోధన--బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# భద్రకాళి చెరువు పూడికతీత పనులకు శ్రీకారం

## రూ.16.10 కోట్లతో పనుల ప్రారంభం
## మే 15లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం





**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగర అభివృద్ధిలో కీలకమైన భద్రకాళి చెరువు పునరుద్ధరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భద్రకాళి చెరువు పూడికతీత పనులను వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంయుక్తంగా ప్రారంభించారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన భద్రకాళి చెరువు సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టెంకాయ సమర్పించి పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి ఆలయాన్ని జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరంగల్ నగర అభివృద్ధిలో కీలకమైన భద్రకాళి చెరువును పునరుద్ధరించి ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. గతంలో రూ.9 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన పూడికతీత పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో, ప్రస్తుతం రూ.16.10 కోట్ల నిధులతో సమగ్రంగా పూడికతీత పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో ఎలాంటి అవాంతరాలు లేకుండా చెరువు పునరుద్ధరణతో పాటు మాడవీధుల నిర్మాణ పనులు కూడా చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా సమష్టి నాయకత్వంతో వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా ఆలయం నుంచి బండ్ వైపు గ్లాస్ వంతెన ఏర్పాటు చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ ప్రాంతాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సుమారు 70 ఏళ్ల క్రితం చెరువులో పూడికతీత పనులు జరిగాయని గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఈ పునరుద్ధరణ పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. మే 15లోగా సుమారు 7 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, మామిండ్ల రాజు, ఇరిగేషన్ ఎస్ఈ రాంప్రసాద్, ఈఈ కిరణ్ కుమార్, కుడా ఈఈ భీమ్ రావు, ఇరిగేషన్ డీఈ మధుసూదన్, ఏఈలు వేణుగోపాల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న అధునాతన రోబోటిక్ ఎండోస్కోపిక్ సర్జరీలు




**హన్మకొండ, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

అధునాతన సర్జికల్ పద్ధతుల్లో భాగమైన రోబోటిక్ ఎండోస్కోపిక్ సర్జరీలు ప్రస్తుతం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని యశోద హాస్పిటల్‌కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ కె.ఎస్. కిరణ్ తెలిపారు. శుక్రవారం హనుమకొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సాంకేతికత ద్వారా పేషెంట్లకు మరింత సురక్షితమైన మరియు త్వరితగతిన కోలుకునే చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. కీ-హోల్ సర్జరీల ద్వారా పెద్ద గాట్లు లేకుండా చిన్న రంధ్రం ద్వారా ఎండోస్కోప్ సహాయంతో శస్త్రచికిత్స నిర్వహించవచ్చని తెలిపారు. దీంతో పేషెంట్ త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి తిరిగి చేరుకునే అవకాశం ఉంటుందని వివరించారు. నావిగేషన్ సిస్టమ్ గురించి వివరించిన ఆయన, ఇది గూగుల్ మ్యాప్స్‌లా పనిచేస్తుందని చెప్పారు. సర్జరీ సమయంలో మెదడులో ఏ భాగంలో ట్యూమర్ ఉందో, ఏ దిశలో ముందుకు వెళ్లాలో నావిగేషన్ మెషిన్ ద్వారా ఖచ్చితంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఇటీవల ఒక టిబి గడ్డ క్రిటికల్ ప్రాంతంలో పెరుగుతున్న కేసును బయాప్సీ కోసం తమ వద్దకు పంపగా, రోబోటిక్ నావిగేషన్ అసిస్టెడ్ సర్జరీ ద్వారా ఆ గడ్డను పూర్తిగా తొలగించామని చెప్పారు. రోబోటిక్ న్యూరో సర్జరీ వల్ల చికిత్స ఖర్చు తగ్గడం, పేషెంట్ త్వరగా కోలుకోవడం, ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉండడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. అలాగే న్యూరో మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పేషెంట్ మత్తులో ఉన్నప్పటికీ సర్జరీ సమయంలో చేతులు లేదా కాళ్లపై ప్రభావం పడే ప్రమాదం ఉంటే వెంటనే గుర్తించవచ్చని చెప్పారు. న్యూరో అనస్థీషియా సహాయంతో ఆ వేవ్స్‌ను గమనిస్తూ అత్యంత సురక్షితంగా శస్త్రచికిత్స నిర్వహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కాల్వ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్లు రాజుకుమార్, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శికి ఏసీబీ షాక్



**గద్వాల్, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్పురం పంచాయతీ కార్యదర్శి రంగన్న, పేద లబ్ధిదారుడికి మంజూరైన ఇందిరమ్మ ఇంటికి క్లియరెన్స్ ఇవ్వడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో, ఏసీబీ అధికారులు రంగన్నను ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో రూ.15 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పేదలకు అందాల్సిన పథకాల విషయంలో లంచం అడిగితే సహించేది లేదని ఏసీబీ అధికారులు తెలిపారు.

# విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ

**జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్**

**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్ :**

రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఉద్యోగాల కోసం పోరాడుతున్న విద్యార్థి నాయకులను తెల్లవారుజామునే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు చర్య అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోలో భాగంగా జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమం జరగకుండా చేయడానికి ప్రభుత్వం పోలీసులను వినియోగించి తెల్లవారుజామునే విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ద్వారా తమ హక్కులను హరించిందని ఆరోపించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తపరచుకునే స్వేచ్ఛను కల్పించిందని గుర్తుచేశారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగులు తమ భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, డిమాండ్లు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమైన విషయమని తెలిపారు. అయితే ప్రభుత్వం ఈ హక్కును కూడా అణిచివేయడానికి ప్రయత్నించడం ఆందోళనకరమని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ “ఏడవ గ్యారంటీ”గా రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం ద్వారా ఆ హామీని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని చెప్పిన ప్రభుత్వం విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అలాగే అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలులో సరైన పురోగతి కనిపించకపోవడం వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన నియామక పత్రాలను మాత్రమే ఇవ్వడం కాకుండా, కొత్తగా ఖాళీగా ఉన్న పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా, సమయపాలనతో జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత భవిష్యత్తును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. అలాగే రేపు విద్యార్థి, నిరుద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీజీపీఎస్సీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కామగోని శ్రావణ్ (డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్), మంద శ్రీకాంత్ (ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి), మర్రి మహేష్ (పిడిఎస్యు జిల్లా కార్యదర్శి), ఎల్తూరి సాయి కుమార్ (ఎస్ఎస్యు జిల్లా అధ్యక్షుడు), రాచకొండ రంజిత్ (పిడిఎస్యు జిల్లా కార్యదర్శి), అశోక్ (సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు) తదితరులు పాల్గొన్నారు.



# స్నేహం,ఐక్యత,సోదర భావానికి ప్రతీక రంజాన్ పండుగ

**హిందూ, ముస్లింలు గంగా జమునా తహజీబ్ లా పండుగలు జరుపుకోవాలి - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.**

**పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లింలకి ప్రత్యేక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే నాయిని**

**ఇఫ్తార్ లో పాల్గొన్న ఎమ్మెల్సీ , కూడా చైర్మన్,హాజ్ కమిటీ చైర్మన్,మేయర్**

**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**

స్నేహం, ఐక్యత, సోదర భావానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ పండుగను హిందూ, ముస్లింలు గంగా--జమునా తహజీబ్ స్ఫూర్తితో కలిసి జరుపుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరుల కోసం హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రత్యేక ఇఫ్తార్ విందును నిర్వహించారు. ప్రతియేటా పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు ప్రత్యేక ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లిం మత పెద్దలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు నిర్వహించారు. సుమారు 2000 మందికి పైగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఉపవాసం, త్యాగం, సేవా భావం, పరస్పర సహకారానికి ప్రతీక అని తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పడంలో ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. వరంగల్ నగరం ఎప్పటి నుంచో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని, అన్ని మతాల ప్రజలు కలిసి పండుగలు జరుపుకోవడం ఈ నగర ప్రత్యేకత అని పేర్కొన్నారు. ముస్లిం సోదరుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మైనార్టీల విద్యా అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, స్వయం ఉపాధి పథకాల అమలు, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మసీదులు మరియు మత సంబంధిత స్థలాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముస్లిం యువతకు విద్యా రంగంలో ప్రోత్సాహం అందించేందుకు మరియు వారి సామాజిక--ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పేద ముస్లిం కుటుంబాలకు సహాయంగా సుమారు 1700 మందికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రంజాన్ బహుమతులు అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని 7 ప్రధాన మస్జిద్‌లలో ఇఫ్తార్ విందుల నిర్వహణకు గాను రూ.7 లక్షల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇదే కాకుండా సుమారు 100 మంది ముస్లిం మత పెద్దలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా కొత్త బట్టలు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముస్లిం సోదరుల పట్ల తనకు ఉన్న అభిమానం, గౌరవానికి ఇది నిదర్శనమని తెలిపారు. ముస్లిం సోదరుల సమస్యలను పరిష్కరించడం, వారి అభివృద్ధికి సహకరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. రానున్న రోజుల్లో కూడా మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ ఇఫ్తార్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య ,రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్,ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ,నగర మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు.



# కేయూలో విద్యా సమస్యలపై విద్యార్థులు, కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ అధ్యాపకుల ఆవేదన

**ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తాం - తీన్మార్ మల్లన్న**

**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్ :**

కాకతీయ యూనివర్సిటీలో విద్యా సంబంధిత సమస్యలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తో విద్యార్థులు, కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది సుదీర్ఘంగా చర్చించారు. యూనివర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల సమస్యలు, అధ్యాపకుల సేవా భద్రత, ఫీజుల పెంపు, హాస్టల్ సదుపాయాలు, యూనివర్సిటీ భూముల పరిరక్షణ తదితర అంశాలపై ఈ చర్చ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, పార్ట్‌టైమ్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ, ఔట్సోర్సింగ్ సిబ్బంది, నాన్ టీచింగ్ స్టాఫ్ తమ సమస్యలను వివరంగా వెల్లడించారు. విద్యార్థులు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ అధ్యాపకులు లేవనెత్తిన ప్రధాన సమస్యలు చర్చలో భాగంగా పలువురు పలు కీలక సమస్యలను మల్లన్న దృష్టికి తీసుకువచ్చారు. గత పది సంవత్సరాలుగా 16 పీరియడ్స్ వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను జీవో నంబర్ 11 ప్రకారం తక్షణమే కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పరిగణించాలని వారు డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా నిరంతరం పనిచేస్తున్నప్పటికీ సరైన గుర్తింపు, ఉద్యోగ భద్రత లభించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే యూనివర్సిటీలో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, 2021 సంవత్సరంలో పెంచిన విద్యా కోర్సుల ఫీజులు , పరిశోధన ఫీజులను పూర్తిగా తగ్గించాలని విద్యార్థులు కోరారు. అధిక ఫీజుల కారణంగా ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని కూడా వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం యూనివర్సిటీ హాస్టళ్లలో సీట్లు సరిపోక చాలా మంది విద్యార్థులు బయట నివాసం ఉండాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా గర్ల్స్ హాస్టళ్లలో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని విద్యార్థినులు వివరించారు. తగిన సదుపాయాలు లేకపోవడం, భద్రతా సమస్యలు, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాల్లో తీవ్ర లోపాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఇదే సమయంలో యూనివర్సిటీ భూములపై జరుగుతున్న కబ్జాలపై కూడా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ ఆస్తులను రక్షించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గత రెండు దశాబ్దాలుగా యూనివర్సిటీ భూములపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు పరిపాలన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై కేసులు నమోదు చేయడం, పరిపాలనా ఒత్తిళ్లు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలను కూడా ఈ చర్చలో ప్రస్తావించారు. గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ, ఔట్సోర్సింగ్ సిబ్బంది తమ ఉద్యోగ పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా తమకు ఎదురవుతున్న పరిపాలనా ఇబ్బందులను మల్లన్న దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కొంతమంది విశ్వవిద్యాలయంలో ఉన్న సమస్యలను వివరించేటప్పుడు భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం తమను తీవ్రంగా కలచివేస్తోందని వారు తెలిపారు.

**జై భీమ్ న్యూస్ కథనంపై ప్రశంసలు**

ఈ సమస్యలన్నింటిపై గత సంచికలో జై భీమ్ న్యూస్ కులంకషంగా 26 ప్రశ్నలను సంధిస్తూ కాకతీయ యూనివర్సిటీలో పేరుకుపోయిన సమస్యలను ప్రజల దృష్టికి, విద్యార్థుల దృష్టికి తీసుకువచ్చారు. ఆ కథనం విశ్వవిద్యాలయంలో ఉన్న సమస్యలను విస్తృతంగా చర్చకు తెచ్చిందని పలువురు విద్యార్థులు, ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పేర్కొన్నారు. సెమినార్‌లో జరిగిన చర్చ మొత్తం కూడా దాదాపుగా జై భీమ్ న్యూస్ ప్రచురించిన ఆ 26 ప్రశ్నల చుట్టూనే సాగినట్లు కనిపించిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయంలో ఉన్న సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకువచ్చినందుకు జై భీమ్ న్యూస్ ను పలువురు



విద్యార్థులు, కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

**మల్లన్న స్పందన**

విద్యార్థులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ అధ్యాపకులు నాన్ టీచింగ్ స్టాఫ్ లేవనెత్తిన సమస్యలపై స్పందించిన తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికి కీలకమని అన్నారు. యూనివర్సిటీ భూములు పూర్తిగా విద్యాభివృద్ధికే వినియోగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు మరియు అధ్యాపకులు ప్రస్తావించిన ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోస.









# వరంగల్ నగరం మత సామరస్యానికి ప్రతీక..

**ఫాతిమా మాత ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి..**

**ఫాతిమా ఫీస్ట్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని..**




**ఫాతిమా నగర్ / జై భీమ్ న్యూస్ :**

కాజీపేట ఫాతిమా నగర్ చర్చి లో నిర్వహించిన ఫాతిమా మాత మహోత్సవ వేడుకల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, క్రైస్తవ మత పెద్దలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ నగరం అనేది ఎప్పటి నుంచో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రజలు పరస్పర గౌరవంతో, ఐక్యతతో జీవించడం వరంగల్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. ప్రతి సంవత్సరం ఎంతో భక్తి శ్రద్ధలతో కాథలిక్ క్రైస్తవులు నిర్వహించే ఫాతిమా మాత మహోత్సవం ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని, భక్తులందరికీ ఫాతిమా మాత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మానస రాంప్రసాద్,మాజీ కార్పొరేటర్ అబూబకర్,సీనియర్ నాయకులు హ్ పాల్ ఆనంద్,కార్డినల్ పూనా అంతోని,విశ్రాంత బిషప్ జోసెఫ్,పాలనాధికారి ఫాదర్ విజయపాల్,ఫాతిమా చర్చి గురువుకు మర్రెడ్డి స్థానిక క్రైస్తవ మత పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం




**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా తెలంగాణ జాగృతి నాయకత్వం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పోలంపల్లి రమేష్, గుండ్రెడ్డి రోహిత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా తెలంగాణ జాగృతి అధ్యక్షులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత జన్మదినం రోజున రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో మంచి సేవా కార్యక్రమమని అన్నారు. ప్రస్తుతం రక్తం కొరత ఉన్న సమయంలో సుమారు 30 యూనిట్ల రక్తాన్ని దానం చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా పోలంపల్లి రమేష్, గుండ్రెడ్డి రోహిత్‌లను ఆయన అభినందించారు. అలాగే కవితక్క చేస్తున్న సామాజిక సేవలు, పోరాటాల గురించి వివరించారు. తెలంగాణ జాగృతి ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ జాగృతిని ఒక రాజకీయ పార్టీగా ఏర్పాటు చేసి, సామాజిక తెలంగాణ లక్ష్యంతో యువకులు మరియు మహిళలకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. అలాగే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తూ అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మే నెల మొదటి వారంలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కవిత రాజకీయ నాయకత్వాన్ని చూసి ఇప్పటికే అనేక వర్గాల ప్రజలు ఆ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జన్మదినాన్ని హనుమకొండ జిల్లా నాయకత్వం పెద్ద ఎత్తున జరుపుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా నాయకులు మంజుల రావు, చిగుమల్ల మౌనిక, రాధాకృష్ణ, దయ్యాల నాగరాజు, ప్రవీణ్ యాదవ్, రత్నాకర్, బుర్రి ప్రభు తదితర జిల్లా నాయకులు, జాగృతి కార్యకర్తలు పాల్గొని కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు.

## తిరుమల కొండపై కొనసాగుతున్న భక్తుల రద్దీ

**తిరుమల, జై భీమ్ న్యూస్**

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న యాత్రికులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ భక్తులతో పూర్తిగా నిండిపోవడంతో, స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. నిన్న (మార్చి 12న) మొత్తం 68,754 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే 25,569 మంది యాత్రికులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. గురువారం నాడు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.3.68 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల ఉన్న క్యూలైన్లు కృష్ణా తేజ అతిథి గృహం వరకు చేరుకున్నాయి.

# వారి జోలికి వెళితే మళ్లీ అధికారంలోకి రాలేమని మాకు తెలుసు: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

పేదల జోలికి వెళితే మాకు మళ్లీ అధికారం వస్తుందా, అలాంటప్పుడు మేం పేదలకు అన్యాయం ఎందుకు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పేదలకు మేం మంచి చేస్తే, తాము అధికారంలోకి రాలేమని ప్రతిపక్ష నాయకులకు భయం పట్టుకుందని విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూసీ అభివృద్ధిని బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. రెండేళ్లుగా అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించాకే ముందడుగు వేస్తున్నామని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు ఇప్పటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ వంటి ప్రాజెక్టులకు కొంతమంది అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూసీ, ఈసా సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూఘాట్‌ను పర్యాటక కేంద్రంగా చేస్తామని అన్నారు. మూసీ, గోదావరి జలాలతో ప్రజల దాహార్తిని తీర్చే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఘనమైన చరిత్ర కలిగిన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతే ఎలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులు ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాజెక్టులను అడ్డుకోవద్దని కోరారు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో చెరువులను పునరుద్ధరిస్తున్నామని, ప్రజలు కూడా తమను స్వాగతిస్తున్నారని తెలిపారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్న వారు ఇప్పుడు అదే కాలువ పక్కన నివసించగలుగుతారా అని ప్రశ్నించారు. అలాంటి వారికి కంటైనర్‌లు ఇస్తానని, నివసించాలని సవాల్ చేశారు. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ తీవ్రంగా దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాలు కోలుకోలేని విధంగా నష్టపోతాయని అన్నారు. అన్నింటిని పరిగణనలోకి తీసుకుని మూసీ ప్రాజెక్టుపై ముందుకు వెళుతున్నామని అన్నారు. శుక్రాచార్యుడు, ఆయన శిష్యులు నిత్యం యజ్ఞాలను భగ్నం చేసేవారని, కానీ దేవుళ్లు ఆ యజ్ఞాలను ఆపకుండా కొనసాగించారని అన్నారు. ప్రజల మంచి కోసం ప్రాజెక్టులపై తాము కూడా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. తాను హిందువునని, కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానని తెలిపారు. వేరే మతాలను కూడా గౌరవిస్తానని అన్నారు. హైదరాబాద్ నగరం కాంక్రీట్ జంగిల్‌లా మారిపోయిందని ముఖ్యమంత్రి అన్నారు. తన ఇంట్లో 1,300 ఫీట్లు వేస్తే కానీ బోరులో నీళ్లు రాలేదని చెప్పారు. అండర్ గ్రౌండ్ వాటర్ పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో 10 వేల కుటుంబాలు ఉన్నాయని, ప్రక్షాళన నేపథ్యంలో ఒక్కో కుటుంబానికి ఎంత ఇద్దామో ప్రతిపక్షాలు చెప్పాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ఇప్పటికే రూ.10 వేల బెడ్రూంలు ఇచ్చామని తెలిపారు. పేద ప్రజలతో తాను శత్రుత్వం ఎందుకు పెంచుకుంటానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. వారితో కంటతడి పెట్టించాల్సిన అవసరం తనకేమిటని అన్నారు. పేదలకు మంచి చేస్తేనే మళ్లీ అధికారంలోకి వస్తామనే విషయం తనకు తెలుసని అన్నారు. దుబాయ్ కంటే హైదరాబాద్ సురక్షితమైన ప్రాంతమని ఆయన అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా అబద్ధాల వేదిక అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గాంధీ సరోవర్‌కు రూ.200 కోట్లు కేటాయిస్తుంటే రూ.5 వేల కోట్లు అని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు గొప్ప గొప్ప చదువులు చదువుకోవచ్చు, నేను ప్రభుత్వ కాలేజీలో చదువుకోవచ్చు, కానీ అన్నీ నేర్చుకుంటున్నానని ముఖ్యమంత్రి అన్నారు. అయినా అభివృద్ధి వద్దని మీరంతా చెబితే ఆపేస్తానని ముఖ్యమంత్రి అన్నారు. మీకు అవసరం లేని అభివృద్ధి నాకెందుకని ప్రశ్నించారు. తాను మంచికి ప్రతినిధిగా కావాలనుకుంటున్నానని అన్నారు. తెలంగాణకు రెండో ముఖ్యమంత్రి అయ్యే అవకాశం తనకు వచ్చిందని, రెండు మంచి పనులు చేయాలనే ఆలోచనతో ఉన్నానని అన్నారు. గాంధీని చంపిన వాళ్లు కూడా ఈరోజు నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.



# కారుతో చెరువులోకి దూసుకెళ్లిన ఘటన.. కేసు నమోదు

**మద్యం మత్తులో నిర్లక్ష్య డ్రైవింగ్ కారణం - షాద్‌నగర్ సీఐ సీతారాం వెల్లడి**

షాద్‌నగర్, 13 మార్చి 2026(జై భీమ్ న్యూస్)




మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడపడంతో అది చెరువులోకి దూసుకెళ్లిన ఘటన షాద్‌నగర్ పురపాలక పరిధిలోని చటాన్‌పల్లి సురసముద్రం చెరువు వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు, డీఆర్‌ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టాయి. అనంతరం చెరువులో పడ్డ కారును బయటకు తీశారు. కారు నంబర్ ఆధారంగా యజమాని వివరాలు సేకరించగా, అది రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగిర్ పరిధిలోని ర్యాలీ కాలనీకి చెందిన కాజ్జాం రామంతకు చెందినదిగా గుర్తించారు. ఈ విషయమై రామంతను సంప్రదించగా, తన కారును హైదరాబాద్ అత్తాపూర్ నలంద నగర్‌కు చెందిన శ్రీకాంత్ రెడ్డికి ఇచ్చినట్లు తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి, నరేష్ ఇద్దరూ మద్యం సేవించి కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అది చెరువులో పడిపోయి పూర్తిగా దెబ్బతిన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. కారు యజమాని రామంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ కె. సీతారాం మీడియాకు వెల్లడించారు.

# ఆర్‌ఎంపి వైద్యుడిపై దాడి చేసి గొలుసు దోపిడీ

**24 గంటల్లో ఐదుగురు అరెస్ట్**




కరీంనగర్, 13 మార్చి 2026 (జై భీమ్ న్యూస్):

జిల్లాలో ఆర్‌ఎంపి వైద్యుడిపై దాడి చేసి బంగారు గొలుసును దోచుకున్న కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ సలాం వెల్లడించిన వివరాల ప్రకారం, గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు, తిమ్మాపూర్ మండలం నూస్తులాపూర్ గ్రామానికి చెందిన ఒక యువకుడు, పెద్దపల్లి జిల్లా బొట్ల వనపర్తి గ్రామానికి చెందిన మరో యువకుడు, అలాగే ఒక మైనర్ బాలుడు కలిసి ఈ దాడి, చోరీకి పాల్పడ్డారు. నిందితులు ఆర్‌ఎంపి వైద్యుడిపై దాడి చేసి ఆయన ధరించిన బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేశారు. అదేవిధంగా, ఈ నిందితులు గతంలో కరెంటు మోటార్ల దొంగతనాలకు కూడా పాల్పడినట్లు దర్యాప్తులో బయటపడినట్లు సిపి గౌస్ సలాం తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని సీపీ అభినందించారు.

# గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత

**సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు: పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే పూర్తి బాధ్యతని, అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ కొరతపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు. మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విజన్ ఉందని, ఈ ప్రాజెక్టుపై ఉన్న అన్ని అనుమానాలను పీపీటీ ద్వారా నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని, వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీకి మూసీ ప్రాజెక్టుపై ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, అందుకే ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. బీజేపీకి రాష్ట్రంలో ఒక అజెండా, దేశంలో మరో అజెండా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం అనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, దీనిపై అనవసర రాద్ధాంతం చేయవద్దని సూచించారు.



# వంట గ్యాస్‌పై ఆందోళన

**కేంద్రమంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, ఎల్పీజీ సిలిండర్ల కొరతపై వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి లేఖ రాశారు. గృహ అవసరాల కోసం ఎల్పీజీ సిలిండర్ల కొరతను సమన్వయంతో పునరుద్ధరించాలని కోరారు. గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు, హాస్టళ్లు ఎదుర్కొంటున్న సంక్షోభ నివారణకు తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ సరఫరాను పునరుద్ధరించకపోతే హైదరాబాద్ సహా తెలంగాణవ్యాప్తంగా దాదాపు 90 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు 48 గంటల్లో మూతపడే ప్రమాదం ఉందని రాష్ట్రంలోని హోటల్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. గ్యాస్ కొరత కారణంగా హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పీజీ హాస్టళ్లలో నివసించే లక్షలాది మంది విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు భోజనానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్యాస్ కేటాయింపుల్లో పెద్ద పెద్ద సంస్థల కంటే చిన్న చిన్న వ్యాపారులు, సంస్థలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సంక్షోభం ముగిసేవరకు వాణిజ్య సిలిండర్ల ధరలు పెరగకుండా నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ లభ్యతపై ప్రజల్లో ఉన్న అయోమయాన్ని తొలగించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇందుకోసం జిల్లాస్థాయి పంపిణీ వివరాలతో కూడిన పబ్లిక్ డ్యాష్ బోర్డును అందుబాటులోకి తేవాలన్నారు. గృహ అవసరాల కోసం రావాల్సిన సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆ లేఖలో కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. హోటల్ రంగంపై 80 లక్షలమంది దినసరి కూలీలు ఆధారపడి బతుకుతున్నారని, వారికి ఉపాధికి గ్యారెంటీ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం మాటలతో సరిపెట్టకుండా తక్షణమే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# అసోం నుంచి తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ రైలు ప్రారంభం



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

అసోం, రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ రైలును ప్రధాని అసోంలో ప్రారంభించారు. అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్య, చర్లపల్లి మధ్య స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఈ రైలు సేవలు అందించనుంది. దీనితో ఈశాన్య ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఈ రైలు మార్గమధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం పట్టణం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతూ, అక్కడి నుంచి చర్లపల్లికి చేరుకుంటుంది.

# ప్రయాణికులపై ఫ్యూయల్ ఛార్జ్ భారం.. ఇండిగో నిర్ణయం




ఢిల్లీ, జై భీమ్ న్యూస్

ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం అన్ని రంగాలపై పడింది. పశ్చిమాసియా ఉద్రికతల కారణంగా విమాన ఇంధన ధరలు భారీగా పెరగడంతో ప్రయాణికులపై ఆ భారం పడుతోంది. ఇప్పటికే విమాన ఛార్జీలు పెరగగా, తాజాగా ఫ్యూయల్ ఛార్జీ పేరిట కొత్త ఛార్జీలను వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే ఎయిరిండియా టిక్కెట్ ధరలపై సర్‌ఛార్జ్ వేస్తోంది. తాజాగా ఇండిగో ఫ్యూయల్ ఛార్జ్ వసూలు చేయాలని నిర్ణయించింది. ఇండిగో విమానయాన సంస్థ ఫ్యూయల్ సర్‌ఛార్జ్ పేరిట ఒక్కో టిక్కెట్‌పై రూ.425 నుంచి రూ.2,300 వరకు వసూలు చేయనుంది. రేపటి నుంచి ఈ ఛార్జీలు అమల్లోకి వస్తాయని తెలిపింది. ఫ్యూయల్ ఛార్జ్ వసూలు విషయానికి వస్తే, దేశీయ ప్రయాణ టిక్కెట్లపై రూ.425, మధ్యప్రాచ్యం వెళ్లే విమాన టిక్కెట్‌పై రూ.900, ఆగ్నేయాసియా, చైనా, పశ్చిమాసియాకు వెళ్లే విమానాల టిక్కెట్‌పై రూ.1,800, యూరప్ వెళ్లే విమానాల్లో ఒక్కో టిక్కెట్‌పై రూ.2,300 చొప్పున ఫ్యూయల్ ఛార్జీని ఇండిగో వసూలు చేయనుంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో 40 శాతం వరకు ఇంధనం వాటా ఉంటుంది. ఇప్పుడు అంతర్జాతీయంగా ఏటీఎఫ్ ధరలు పెరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులపై కొంత భారం మోపాల్సి వచ్చిందని ఇండిగో విమానయాన సంస్థ తన ప్రకటనలో తెలిపింది.

# హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు: దేవ్‌జీ

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన ఈరోజు ఒక మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.




# ‘రేవంతన్న’ అంటూ థ్యాంక్స్ చెప్పిన అల్లు అర్జున్

**కోకాపేటలో అల్లు సినిమాస్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి**
**‘థ్యాంక్యూ వెరీమచ్ రేవంతన్న’ అంటూ సంబోధించిన అల్లు అర్జున్**
**తన తండ్రి తెలుగు సినిమా పరిశ్రమకు చాలా సేవ చేస్తున్నారన్న స్టైలిష్ స్టార్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్న ‘రేవంతన్న’ అని సంబోధించారు. ఈరోజు కోకాపేటలో మల్టీప్లెక్స్ ‘అల్లు సినిమాస్’ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ, తమ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించినందుకు ‘థ్యాంక్యూ వెరీమచ్ రేవంతన్న’ అంటూ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సినిమా పరిశ్రమకు మద్దతుగా నిలుస్తోందని అన్నారు. అల్లు అర్జున్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ తన తండ్రి అల్లు అరవింద్ తెలుగు సినిమా పరిశ్రమకు చాలా సేవ చేస్తున్నారని అన్నారు. అల్లు అరవింద్ తెలుగు సినిమాల బాక్సాఫీస్ స్థాయిని పెంచారని కొనియాడారు. అల్లు అరవింద్ తన తండ్రి మాత్రమే కాదని, ఆయన ‘ఫాదర్ ఆఫ్ తెలుగు డిజిటల్ ఎరా’ అని అన్నారు. తన తండ్రి గర్వపడేలా చేస్తామని అన్నారు.

# మలైకాతో డేటింగ్ వార్తలపై యువ నటుడు సోరబ్ బేడీ స్పందన

**తనకంటే 20 ఏళ్లు చిన్నవాడైన సోరబ్ బేడీతో మలైకా డేటింగ్ చేస్తోందంటూ వార్తలు**
**తమ బంధం కేవలం స్నేహం మాత్రమేనన్న సోరబ్**
**చౌకబారు కామెంట్స్ వల్ల ఆమె మానసిక స్థితిపై ప్రభావం పడుతుందని ఆవేదన**



52 ఏళ్ల బాలీవుడ్ ఫిట్‌నెస్ బ్యూటీ మలైకా అరోరా మళ్లీ వార్తల్లో నిలిచింది. ఈసారి ఆమె తనకంటే 20 ఏళ్లు చిన్నవాడైన మోడల్, నటుడు సోరబ్ బేడితో డేటింగ్‌లో ఉందనే వార్తలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ముంబైలో జరిగిన ఒక పార్టీలో వీరిద్దరూ కలిసి డాన్స్ చేయడం, హగ్ చేసుకుని ఫొటోలు దిగడంతో ఈ రూమర్స్ మొదలయ్యాయి. అయితే, ఈ వార్తలపై సోరబ్ బేడి తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందిస్తూ.. ఆ రూమర్స్‌ను పూర్తిగా కొట్టిపడేశాడు. మలైకాతో తనకున్న బంధం కేవలం స్నేహం మాత్రమేనని స్పష్టం చేశాడు. మోడలింగ్ రోజుల్లో తన మెంటార్లయిన డెల్నాజ్ దారువాలా, వాహ్బిజ్ మెహతా ద్వారా మలైకాతో పరిచయం ఏర్పడిందని, గత నాలుగేళ్లుగా తామంతా ఒకే ఫ్రెండ్ సర్కిల్‌లో ఉన్నామని సోరబ్ తెలిపాడు. తాను మలైకాతో పార్టీలకు వెళ్లడం ఇదే మొదటిసారి కాదని... గతంలో కూడా ఆమెతో కలిసి దిగిన ఫొటోలు షేర్ చేశానని చెప్పాడు. అప్పుడు తాను ఫేమస్ కాకపోవడంతో ఎవరూ పట్టించుకోలేదని... ఇప్పుడు తన ముఖం అందరికీ తెలియడంతో వార్తలు సృష్టిస్తున్నారని మండిపడ్డాడు. ఒక అమ్మాయి గురించి మాట్లాడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని... ఇలాంటి చౌకబారు కామెంట్స్ వల్ల ఆమె మానసిక స్థితిపై ప్రభావం పడుతుందని సోరబ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తాము ఒకరినొకరు నమ్ముతాము, కానీ జనం దాన్ని మరోలా చూస్తున్నారని విమర్శించాడు.

## ‘ధురంధర్-2’ నుంచి ‘ఆరి ఆరి’ పాట విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, దర్శకుడు ఆదిత్య ధర్ కాంబినేషన్‌లో వచ్చిన ధురంధర్ చిత్రం ఎంతటి బ్లాక్ బస్టరో తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ‘ధురంధర్: ది రివెంజ్’. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌తో అంచనాలను ఆకాశానికి చేర్చిన ఈ చిత్రం నుంచి తాజాగా ఓ క్రేజీ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఒకప్పుడు సంగీత ప్రపంచాన్ని ఊపిన బాంబే రాకర్స్ పాప్యులర్ సాంగ్ ‘ఆరి ఆరి’కి ఆధునిక హంగులు అద్ది, కొత్త వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తెచ్చింది. ఈ పాట సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రముఖ సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ ఈ క్లాసిక్ హిట్‌ను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా పవర్‌ఫుల్ బీట్స్‌తో రీమిక్స్ చేశారు. రణ్‌వీర్ సింగ్ తనదైన ఎనర్జీ, స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాటకు ప్రాణం పోశాడు. ఇప్పటికే 310 మిలియన్లకు పైగా వ్యూస్‌తో యూట్యూబ్‌ను షేక్ చేసిన ట్రైలర్ తర్వాత, ఈ పాట విడుదలతో సినిమా ప్రమోషన్లు మరో స్థాయికి చేరాయి. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సుమారు రూ. 400 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. ఇందులో రణ్‌వీర్ సింగ్... జస్కీరత్ సింగ్ రంగీ, హమ్జా అనే రెండు పూర్తి విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నారు. భారత గూఢచారి వ్యవస్థ నేపథ్యంలో సాగే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాలో అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్ మాధవన్ వంటి అగ్ర నటులు కీలక పాత్రలు పోషించారు. ప్రపంచవ్యాప్తంగా ఉగాది, ఈద్ పండుగల సందర్భంగా ఈ నెల 19న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో రిలీజ్ కానుంది. ఇక 18న సాయంత్రం నుంచే పెయిడ్ ప్రివ్యూలను భారీ ఎత్తున ప్రదర్శించనున్నారు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఈ సినిమా సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు. ఇప్పటికే ‘స్త్రీ 2’ పేరిట ఉన్న రికార్డులను అధిగమించి, ఆల్-టైమ్ రికార్డు దిశగా దూసుకుపోతోంది.



# అందరికీ గుర్తుండిపోయే సినిమా

‘గబ్బర్ సింగ్’ వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’. ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి పాట, టీజర్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం మూడో గీతం ‘కాలరే ఎత్తరా’ను విడుదల చేసింది. గురువారం సాయంత్రం అభిమానుల కోలాహలం నడుమ హైదరాబాద్‌లోని మైత్రి విమల్ థియేటర్‌లో ఈ గీతావిష్కరణ వేడుక వైభవంగా జరిగింది. దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ, ‘ఈ పాటలో కళ్యాణ్‌తో కలిసి రాశీ అద్భుతంగా డ్యాన్స్ చేసింది. 1500-2000 మందితో భారీస్థాయిలో ఈ పాటను తెరకెక్కించాం. పవన్ కళ్యాణ్ వేసిన డ్యాన్స్‌కి చప్పట్లు, ఈలలతో సెట్ అంతా దద్దరిల్లిపోయింది. ఆయన ఈ సినిమాకి ప్రాణం పెట్టి పని చేశారు. ఈసారి పర్ఫార్మెన్స్ బద్దలైపోయిద్ది ఎందుకంటే సెకండ్ హాఫ్‌లో ఇంటెన్స్ సీన్స్‌లో ఆయన అద్భుతంగా నటించారు. దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం అందించారు. మైత్రి మూవీ మేకర్స్ ఎక్కడా రాజీ పడకుండా సినిమాను నిర్మించారు’ అని అన్నారు. ‘సినిమా చాలా బాగా వచ్చింది. ‘గబ్బర్ సింగ్’ స్థాయికి తగ్గకూడదనే కసితో దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించారు. పవన్‌తో గుర్తుండి పోయే చిత్రం చేయాలని అందరూ కోరుకుంటారు. అలాంటి అద్భుతమైన చిత్రమిది ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ పడిన కష్టం న భూతో న భవిష్యతి’ అని నిర్మాత రవిశంకర్ యలమంచిలి చెప్పారు.